సొదుం జయరాం కథలు

# 30

# ఆచరణ

"బైబిల్‌లో ఒక వాక్యం వున్నదండీ రెడ్డిగారూ! అదేమిటంటే-నువ్వు పస్తున్నట్టు ఇతర్లకి తెలీనీకు; ముఖం కడుక్కో, తల దువ్వుకో, ఇతర్లకి తెలీని విషయాలు భగవంతుడు గ్రహించి బహూకరిస్తాడు" అని.

బస్స్టాపు దగ్గర మేరీ బైబిల్ ప్రసక్తి ఎందుకు తెస్తున్నదా! అని నేను ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే సరిగ్గా రెండు నిమిషాలముందే ఒక చిన్న సంఘటన జరిగింది. ఆ సంఘటనను గురించి నేను యింకా ఆలోచించడం కూడా మానుకోలేదు. ఇంతలోనే మేరీ ఈ మాట అన్నది. ఆ సంఘటనకీ, యీ మాటకీ, ఏ కాస్త ఇంగిత జ్ఞానమున్నా కూడా, సమన్వయం చేసుకోవచ్చు. యే అర్థం ధ్వనించాలని ఆవిడ ఈ మాట అన్నదో ఇట్టే బోధపడిపోయింది.

మేరీ, నేనూ అర్ధగంట సేపట్నుంచీ స్టేజి దగ్గర నిలబడి బస్సుకోసం వెయిట్ చేస్తున్నాను. నిలబడి నిలబడి కాళ్ళు పీకుతున్నవి. ఇంతలోనే సుబ్బారావు వూడిపడ్డాడు. సుబ్బారావుకీ నాకూ ఉన్న సంబంధం-సుబ్బారావుకున్న వేలాది మిత్రుల్లో నేనూ ఒకణ్ణి. వాని తలలో యెన్ని వెంట్రుకలున్నాయో అంతమంది స్నేహితులు వానికి. విచిత్రమేమిటంటే వాడు అవసరముంటే తప్ప స్నేహితుల్ని పలకరించడు. అయినా వాని స్నేహితుల సంఖ్య, ఇండియా జనాభా పెరిగినట్టు, పెరుగుతూనే వుంటుంది. వాని స్నేహితం కోసం ఎందుకట్లా యెగబడతారా అని చాలాసార్లు ఆలోచించాను. మనిషి పొట్టిగా, నల్లగా లోతుకుపోయిన కళ్ళతో, ఎంత వికారంగా ఉండాలో అంత వికారంగానూ వుంటాడు. విపరీతమైన త్రాగుడూ, వ్యభిచారమూ కూడా ఉన్నది. వానిలో ఉన్న ఒక టాలెంట్ ఏమిటంటే కథలు రాస్తాడు. అదైనా పాతికో పరకో సంపాదించుకోడానికి.

సుబ్బారావు వచ్చీ రాగానే "చూశావురా రెడ్డీ, పదిహేనో తారీఖు కూడా వస్తోంది. ఆ లుచ్చాలు ఇంకా జీతం ఇవ్వలేదు" అన్నాడు.

వాడు యెందుకోసం యీ ఉపోద్ఘాతం ప్రారంభించాడో వెంటనే అర్థం అయింది నాకు. నాకేమిటి, వానితో స్నేహితమున్న ప్రతివాడికీ అరమయ్యే విషయమది. సుబ్బారావు ఏదో ఒక దినపత్రికలో పనిచేస్తున్నాడు. ఆ పత్రికలవాళ్ళకు, టంచన్‌గా ఒకటో తారీఖుకే జీతాలిచ్చే అలవాటు ఏనాడూ లేదు. అధవా ఇచ్చినా దాన్ని సుబ్బారావు తన వద్ద ఇరవైనాలుగు గంటలకన్నా యెక్కువ ఒక నిముషంకూడా ఉంచుకోడు. 'బార్'లకు బజారు ముండలకు తగలేసి మరుసటిరోజు నుంచి మిత్రుల మీదికి దాడిచేస్తాడు. సుబ్బారావుని చూస్తూనే గెండె లదిరాయి. వాని ఉపోద్ఘాతం వింటుంటే కాళ్ళ క్రింద భూమి తొలుచుక పోతున్నట్టనిపించింది.

సుబ్బారావు ఉపోద్ఘాతం వదలి అసలు విషయంలోకి దిగాడు. "చూడుగురూ! మొన్నరాత్రే టిక్కెట్లు అయిపోయాయి. నిన్నంతా కాఫీ, టిఫిన్లతో కాలం గడిపాను. అదైనా ఇతర్ల ఖర్చుమీదే అనుకో. ఇవ్వాళ కాఫీ అటుంచి, చార్‌మినార్ సిగరెట్టుకు కూడా నోచుకోలేదు. రెండు రూపాయలుంటే ఇలా పారెయ్యి" అన్నాడు.

జేబులో ఐదురూపాయలున్నది, లేదంటే వాడు జేబులు తారాడడానికి కూడా వెనుదీయడు. అదీగాక ప్రక్కన మేరీ ఉన్నది. నోరెత్తకుండా రెండు రూపాయలూ తీసి వాని చేతిలో పెట్టాను. సుబ్బారావు కృతజ్ఞతన్నా చెప్పలేదు. బాకీ వసూలుచేసుకొని వెళ్ళిపోతున్నట్టు వెళ్ళిపోయ్యాడు.

వాడు అటు వెళ్ళగానే, మేరీ బైబిలు వాక్యాన్ని గుర్తు చేసింది. సుబ్బారావు అన్నం లేదనీ, కాఫీ లేదనీ, సిగరెట్లు లేవని, దేవురించడం ఆవిడలో అసహ్యం కలగజేసినట్టుంది.

"చూడండి. దేవుడనేవాడొకడున్నాడు. ఆ తండ్రి గంపంత కళ్ళతో అన్ని విషయాలూ గమనిస్తూనే ఉంటాడు. ఏ కష్టం కలిగినా ఆయన్ని ప్రార్థించాలి గాని, మానవ మాత్రులతో చెప్పుకొని సహాయం కోరడమేమిటి?" అన్నది.

మేరీకి దేవుని మీది ప్రగాఢమైన విశ్వాసం వున్నమాట నిజం. ఆవిడ రోజూ చర్చికి వెళుతుంది. బైబిలు చాలామట్టుకు కంఠతావచ్చు. ఎప్పుడూ పవిత్రమైన జీవితం గడపాలని తపన పడుతూ ఉంటుంది. అయినా ఆవిడ అన్న మాట మీద నాకు అట్టే విశ్వాసం కుదరలేదు. కష్టాల్లో వున్నప్పుడు తోటి మానవుల సహాయం పొందకుండా, కేవలం భగవంతుని మీద భారం వేసి కూర్చొనే వాళ్లుంటారన్న నమ్మకం నాకు కలగలేదు ఏదో మాట సామెత కన్నదేగానీ, మేరీ మాత్రం అలా ఉండగలదా? అని అనుకున్నాను.

ఉండగలనని రుజూచేసేటట్టు కనిపించింది. ఆవిడ దేన్నైతే నమ్ముతుందో దాన్ని ఆచరణలో పెట్టడానికి ఏమాత్రమూ వెనుదీయదు అన్న అభిప్రాయానికి రావలసి వచ్చింది. ఒక్కసారిగా నాకు ఆవిడమీద ఎక్కడలేని గౌరవమూ పుట్టుకొచ్చింది.

దీని కంతటికీ కారణం ఇది. అకస్మాత్తుగా ఆవిడచేస్తున్న ఉద్యోగం వూడిపోయిందంటే దాని వెనక కొంత తతంగం వున్నది. అసిస్టెంటు డైరెక్టరు గారు ఈమెని ఆశించాడు. అట్లా జరగడానికి

వీల్లేదని మంకుపట్టు పట్టి కూర్చున్నది ఈమె. ఒకరు అటూ, మరొకరు ఇటూ లాగడంతోటే మధ్యలో ఉన్న కాస్త ఉద్యోగం వూడింది.

అయినా ఆవిడ ఏం బాధపడ్డట్టు కన్పించలేదు. ఏవో కొన్ని ఆఫీసుల్లో ఖాళీలున్న వని అప్లికేషన్లు పెట్టింది. అంతకు మినహా మరే ప్రయత్నమూ చెయ్యలేదు. నిశ్చింతగా కూర్చున్నది. వెనక ఆస్తిపాస్తులు కూడా లేవు. ఇట్లా ఎన్నాళ్ళు గడుపుతుందో నాకు అర్థంకాలేదు.

"ఎమ్మెల్యేలూ, ఎమ్మెల్సీలూ మీకు తెలిపినవారెవరూ లేరా?" అన్నాను.

"దేనికి" అన్నది అమాయికంగా.

ఆవిడ అమాయకత్వం చూసి నవ్వాలో యేడవాలో కూడా తెలీలేదు.

"ఎవరూ తెలీకపోతే ఉద్యోగం యెట్లా వస్తుంది?" అని అన్నాను.

'ఆ తండ్రి లేడా?" అంది.

ఆవిడ విశ్వాసం చూస్తుంటే వళ్ళు పులకరించింది. ఒక కొవ్వొత్తి మరో కొవ్వత్తిని వెలిగిస్తుందంటారే అట్లాగే ఆవిడ విశ్వాసం నాలోనూ పాదుకొలిపేట్టు కన్పించింది. పాపం ఎన్ని ఇక్కట్లు యెదుర్కొంటున్నదో ఒక్కటీ చెప్పలేదు. సహాయం అర్థించలేదు. నవ నవ లాడే వళ్ళు నాకళ్ళముందే చిక్కి, ఎముకల గూడుగా తయారవుతోంది. సుబ్బారావు విషయంలో ఆమె ఏమాట అయితే అన్నదో దాన్ని అక్షరాలా ఆచరించి చూపుతోంది అందువల్ల ఆమె నాలో ఒక మహోన్నతమైన నిర్లిప్తత, ఉదాసీనతా, నాకేమాత్రమూ నచ్చలేదు. ఆవిడ పరిస్థితులు నాకు తెలుసు. కనీసం రోజుకొక్క పూటైనా ఈ మధ్య ఆవిడ సంతుష్టిగా భోంచేస్తున్నదన్న నమ్మకం నాకు లేదు. ఒకసారి అట్లా ఆమె యింటికి వెళ్లాను. నేను వెళ్ళేసరికి ఆమె మంచంమీద పడుకొని ఏదో ఆలోచిస్తోంది. ప్రాణం కళ్ళల్లో వున్నది. నన్ను చూచి లేవబోయి, తూలి క్రింద పడిపోయింది.

"రాత్రి కొద్దిగా జ్వరం వచ్చింది. కాస్త నీరసంగా వున్నది ఇప్పుడు" అన్నది లేచి.

జ్వరమూ కాదు పులకరమూ కాదు. తిండి లేకపోవడం వల్ల వచ్చిన అవస్థ అది. నిజం వొప్పుకోడానికి అడ్డువస్తోంది.

ఏమన్నా సహాయం చేద్దామనుకుంటే చేత దమ్మిడీ లేదు. రెండు రోజులుగా ఆఫీసుకు కూడా నడిచిపోవలసి వస్తోంది. సిటిలో చేబదుళ్ళు పుట్టించడం, సుబ్బారావులాంటి వాళ్ళకు తప్ప అందరికీ సాధ్యంకాదు. ఆమెకు నేను ఇవ్వగలిగిందల్లా ఇంత సానుభూతి. ఆమె అదేం అవసరం లేదంటోంది. గమ్మున యింటికొచ్చాను.

ఇంటికొచ్చిన తర్వాత ఆలోచించాను; ఆమెతో బలవంతంగా నైనా సరే గట్టి వుద్యోగ ప్రయత్నం చేయిస్తేతప్ప లాభంలేదని. నాకు తెలిసిన ఎమ్మెల్సీ ఒకాయన వున్నాడు. దేవాంతకుడు. మేరీని తీసుకెళ్ళి పరిచయం చేసి, ప్రయత్నిస్తే ఏదో ఒక వుద్యోగం సంపాదించలేకపోడు. మూడు రోజులు వెతికి వెతికి ఎట్లాగయితేనేం, ఆయన్ని పట్టుకున్నాను. ఆయన అంతా విని "చూద్దాంలే" అన్నాడు ముక్తసరిగా. మేరీని కూడా తీసికెళ్ళి పరిచయం చేసి, ఒకసారి కదిలిద్దా మనుకున్నాను.

ఇట్లా వుండగానే, మేరీకి వుద్యోగం దొరికిందన్న వార్త అందింది. నా ఆశ్చర్యానికి అంతూ పొంతూ లేదు. యీ రోజుల్లో ఏ సిఫార్సూ లేకుండా వుద్యోగం సంపాదించటం మాటలా? నిజంగా ఆ తండ్రి అనేవాడు యెవడో ఒకడు వున్నాడనే అనిపించింది.

వెంటనే అభినందనలు తెల్పుదామని బయలుదేరాను. దార్లో సుబ్బారావు కనిపించాడు. ప్రక్కకు తప్పుకుందామని ప్రయత్నిస్తుండగానే వచ్చి దగ్గర పడ్డాడు. కాఫీకో, సిగరెట్లకో డబ్బు అడగలేదు. పై పెచ్చుతనే నన్ను కాఫీ హోటల్‌కు ఈడ్చుకపోయాడు. మనిషి మాంచి వుత్సాహం మీదున్నాడు.

"మొక్కజొన్న తోటకాడ
ముసరిన చీకట్లలో
మచ్చుకాడ కలుసుకో
మరువకు మామయ్యో"
అంటూ కూనిరాగం అందుకున్నాడు..

'ఏమిత్రా విశేషం?'

"చెప్పనా? చెబితే సెక్సువల్ జెలసీ ఫీలవుతావేమోనని భయం" అన్నాడు. నవ్వుతూ.

ఏ 'బజారు సరుకో' కాస్త మంచిది తగిలివుంటుంది. నన్ను వూరించాలని చూస్తున్నాడనుకున్నాను.

'చెప్పవోయ్ చంపక' అన్నాను.

'రాత్రంతా మేరీతో గడిచింది. స్వర్గంలో వున్నట్టుండిందంటే నమ్ము' అన్నాడు.

తలమీద సమ్మెట వేసినట్టయింది. దిమ్మెరపోయి వాని ముఖంలోకి చూస్తున్నాను.

"ఏమిటోయ్ అలా చూస్తావ్? ఈ ముఖాన్ని మేరీ యెట్లా ప్రేమించదని ఆలోచిస్తున్నావా? ప్రేమ ఎవడిక్కావాలోయ్ బోడిప్రేమ. మనకు కావలసింది ఆమె యౌవనం. అదైనా వూరికే కాదులే. ప్రతిఫలంగా వుద్యోగం చూపించాను" అన్నాడు.

మేరీకి వుద్యోగం చూపించిన 'తండ్రి' సుబ్బారావు! ఇక అక్కడ ఒక క్షణం వుండబుద్ధవలేదు నాకు.

చర చర బయటికి నడిచాను.